క్లుప్తంగా

వైభవంగా విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవాలు


విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాల్లో పూజలు చేస్తున్న భక్తులు

బోట్‌క్లబ్: స్థానిక సినిమారోడ్డులోని సంతచెరువు దగ్గరలో ఉన్న కనకదుర్గ అమ్మవారి నూతన ఆలయం, విగ్రహ ప్రతిష్ఠోత్సవాలు మంగళవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. 50 ఏళ్ల చరిత్ర కలిగిన ఈ ఆలయం శిథిలావస్థకు చేరుకోవడంతో ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర్‌రెడ్డి ప్రోత్సాహంతో బాలత్రిపుర సుందరి ఆలయ కమిటీ మాజీ చైర్మన్ జొన్నాడ చినబాబు రూ.2 కోట్లు వ్యయంతో ఈ ఆలయాన్ని నిర్మించారు. ప్రతిష్ఠాపన మహోత్సవాల్లో తొలి రోజు ఉదయం, సాయంత్రం గణపతి పూజ, పుణ్యహవాచనం, యాగశాల ప్రవేశం, దీక్షాధారణ, పంచగవ్య ప్రాశన తదితర కార్యక్రమాలు నిర్వహించారు. మల్లిపాముల వెంకట్రావు, అనంతలక్ష్మి దంపతులు, ఎస్.వెంకటరాంబాబు, వెంకటభారతి దంపతులు, జొన్నాడ చిన్నబాబు, నాగేశ్వరి దంపతులు పూజల్లో పాల్గొన్నారు. ఆలయ ఈఓ చింతపల్లి విజయభాస్కర్‌రెడ్డి, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

సీఎం సభ ఏర్పాట్లపై కమిషనర్ సమీక్ష

కాకినాడ: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి గురువారం సామర్లకోట రానున్న నేపథ్యంలో అక్కడి సభ ఏర్పాట్లు, ఇతర అంశాలపై నగరపాలక సంస్థ కమిషనర్ సీహెచ్ నాగ నరసింహారావు కార్పొరేషన్ అధికారులతో మంగళవారం సమీక్షించారు. వివిధ విభాగాధిపతులతో సమావేశమైన ఆయన సభ ఏర్పాట్లలో భాగంగా కాకినాడ నుంచి గృహ నిర్మాణ లబ్ధిదారులు, స్వయం సహాయక సంఘాల సభ్యులను సభకు తీసుకువెళ్లే అంశంపై ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా తీసుకోవలసిన చర్యలు, ఏర్పాట్లపై అధికారులకు సూచనలు ఇచ్చారు. సమావేశంలో నగరపాలక సంస్థ కార్యదర్శి ఎం.ఏసుబాబు, డిప్యూటీ కమిషనర్ కోన శ్రీనివాస్ వివిధ విభాగాధిపతులు పాల్గొన్నారు.

పచ్చదనంతో పర్యావరణ పరిరక్షణ


గురజనాపల్లి హైస్కూలులో మొక్కలు నాటుతున్న బాదం బాలకృష్ణ

కరప: పచ్చదనంతో పర్యావరణాన్ని పరిరక్షించుకోవచ్చని, అందుకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పెంచాలని లయన్స్‌క్లబ్ పూర్వ గవర్నర్ బాదం బాలకృష్ణ పేర్కొన్నారు. కాకినాడ మైత్రి లయన్స్‌క్లబ్ ప్రెసిడెంట్ ఆచంట వెంకటలక్ష్మి, డిస్ట్రిక్ట్ చైర్‌పర్సన్ కర్నాసుల శివ కుమార్‌ల ఆధ్వర్యంలో మంగళవారం గురజనాపల్లి గ్రామంలోని పబ్బినీడి పాపారావు జెడ్పీ ఉన్నత పాఠశాలలో, గ్రామ సచివాలయం వద్ద, శ్మశానవాటికలో సుమారుగా 100 మొక్కలు నాటారు. సర్పంచ్ అనసూరి శ్రీనివాసరావు, ఉప సర్పంచ్ పెంటపాటి సుబ్రహ్మణ్యం, కాకినాడ మైత్రి లయన్స్ క్లబ్ సభ్యులు కేఎల్ నర్సింగరావు, కె.ప్రవల్లిక, హెచ్ఎం ఎం.సాయిమోహన్, స్టాఫ్ సెక్రటరీ ఐ.ప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.

రేపు వికాసలో ఇంటర్వ్యూలు

కాకినాడ సిటీ: వికాస కార్యాలయంలో గురువారం రిలయన్స్ రిటైల్ (హైదరాబాద్) కంపెనీలో పికింగ్ అండ్ ప్యాకింగ్ ఉద్యోగానికి ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు వికాస ప్రాజెక్టు డైరెక్టర్ కె లచ్చారావు మంగళవారం తెలిపారు. ఈ ఉద్యోగానికి ఎస్ఎస్‌సి ఉత్తీర్ణులైన 18 నుంచి 30 సంవత్సరాల లోపు స్త్రీ, పురుష అభ్యర్థులు అర్హులన్నారు. వీరికి నెలకు రూ.15,770 జీతం, నైట్ షిఫ్ట్ అలవెన్సెస్, అటెండెన్స్ బోనస్, రవాణా సౌకర్యం కల్పిస్తారన్నారు. ఆసక్తి గల అభ్యర్థులందరూ కలెక్టరేట్‌లోని వికాస కార్యాలయం వద్ద ఉదయం 9 గంటలకు సర్టిఫికెట్ల జిరాక్సులతో హాజరు కావచ్చని పీడీ తెలిపారు.

చురుగ్గా సీసీ రోడ్డు నిర్మాణం


సీసీ రోడ్డు పనులు పరిశీలిస్తున్న మాజీ కార్పొరేటరు మణికుమార్ తదితరులు

కాకినాడ రూరల్: కాకినాడ మూడో డివిజన్‌లో శాంతనపురి కాలనీలో అంబేడ్కర్ విగ్రహం వీధిలో సిమెంట్ రోడ్డు నిర్మాణ పనులు వేగంగా జరుగుతున్నాయి. ఎమ్మెల్యే కురసాల కన్నబాబు ఆదేశాలతో కార్పొరేషన్ అధికారులు పనులు చేపడున్నారు. పనులను మాజీ కార్పొరేటర్ వడ్డి మణికుమార్, వైఎస్సార్ సీపీ నాయకులు జగన్నాథం, సత్తిబాబు మంగళవారం పరిశీలించారు.

ఉన్నతికి బాట.. చదువుల తోట

- సకల వసతులతో జేఎన్‌టీయూకే ప్రాంగణం
- జిమ్, పార్కు, ప్లేస్‌మెంట్ సెల్ విభాగాలు
- పూర్వ విద్యార్థి సంఘం రూ.2 కోట్ల విరాళం

బాలాజీచెరువు: విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలనే ఉద్దేశంతో 75 ఏళ్ల కిందట ఉమ్మడి తెలుగు రాష్ట్రాల్లో ఏర్పాటైన మూడు ఇంజినీరింగ్ కళాశాలల్లో జేఎన్‌టీయూకే ఒకటి. తొలి ఇంజినీరింగ్ కళాశాలగా ఏర్పడి 75 ఏళ్లు పూర్తయిన సందర్భంగా గత ఏడాది ప్లాటినం జూబ్లీ నిర్వహించారు. వేలమంది విద్యార్థుల భవితకు బాటలు వేస్తూ అనేక సౌకర్యాలు కల్పిస్తోంది. వారి అభ్యున్నతికి తోడ్పడే కార్యక్రమాలు నిర్వహిస్తూ ప్రోత్సహిస్తోంది. అన్ని వసతులు ఇదే ప్రాంగణంలో ఉండేలా ప్రణాళిక రూపొందించారు. రూ.2 కోట్లతో అన్ని వసతులతో స్పోర్ట్స్ కాంప్లెక్స్ నిర్మాణానికి పూర్వ విద్యార్థులు ముందుకు వచ్చారు. బీటెక్, ఎంటెక్ తదితర విభాగాల్లో దాదాపు 1500 మంది విద్యార్థులు చదువుతున్నారు. హాస్టల్, మెస్, బ్యాంకింగ్, పోస్టల్, క్యాంటిన్, డిస్పెన్సరీ వంటి సదుపాయలు అన్ని అందుబాటులో ఉంచారు.

ఆరోగ్యానికి జిమ్.. యోగా..

కళాశాలలో విద్యార్థులు, విద్యార్థినుల ఆరోగ్య పరిరక్షణకు ప్రత్యేకంగా జిమ్ ఏర్పాటు చేశారు. ఉదయం, సాయంత్రం వ్యాయామంపై ఆసక్తి ఉన్న వారు జిమ్‌కు వెళ్తున్నారు. అంతేగాక వ్యాయామ, క్రీడా విభాగం ఆధ్వర్యంలో వాలీబాల్, షటిల్, ఖోఖో వంటి క్రీడలకు శిక్షణ ఇస్తున్నారు.


కళాశాల ఆవరణలో స్వామి వివేకానంద పార్కు

ఉద్యోగ సాధనకు ప్లేస్‌మెంట్ సెల్..

విద్యార్థులకు విద్యను అందించడమే కాదు. చదువు పూర్తయ్యేలోగా ఉద్యోగాలు సాధించేలా శిక్షణ ఇచ్చేందుకు ప్లేస్‌మెంట్ సెల్ ఏర్పాటు చేశారు. ఏటా జూలై నుంచి అక్టోబర్ మధ్యలో ప్రముఖ మల్టీ నేషనల్ కంపెనీలు ఇంటర్వ్యూలు నిర్వహించి దాదాపు 300మందికి ఉపాధి కల్పిస్తున్నారు.


అత్యాధునిక పరికరాలతో జిమ్

సెంట్రల్ లైబ్రరీ

డాక్టర్ బీఆర్ అంబేద్కర్ పేరుతో సెంట్రల్ లైబ్రరీతో పాటు ఎస్సీ, ఎస్టీ బుక్ సెల్ వంటి సదుపాయాలు ఏర్పాటు చేశారు. వీటిలో ప్రముఖ దినపత్రికలతో పాటు విద్యార్థులకు కావలసిన పుస్తకాలు అందుబాటులో ఉన్నాయి.

ఆహ్లాదకరమైన పార్కు

కళాశాలలో స్వామి వివేకానంద, గౌతమ బుద్ధ పార్కులు ఉన్నాయి. విద్యార్థులు సాయంత్రం వేళ ఆహ్లాదకరమైన వాతావరణంలో గడపడానికి పచ్చని మైదానంగా తీర్చిదిద్దారు.

కళాశాల అభివృద్ధికి తోడ్పడాలి



ఇదే కళాశాలలో 1985–87లో ఎంటెక్ అభ్యసించి ఇక్కడే ఈసీఈ ప్రొఫెసర్‌గా విధులు నిర్వహిస్తున్నాను. 2017–20 విద్యా సంవత్సరంలో జేఎన్‌టీయూ అనంతపురం వైస్ చాన్సెలర్‌గా బాధ్యతలు నిర్వర్తించాను. ఇంత చరిత్ర కలిగిన కళాశాల నుంచి ఎందరో విద్యార్థులు విదేశాలతో పాటు కేంద్ర, రాష్ట్ర సివిల్ సర్వీస్‌లో ఉన్నారు. అటువంటి వారందరూ కళాశాల అభివృద్ధికి తోడ్పడాలి. ఈ విద్యాలయం 75 ఏళ్లు నడవడమే కాకుండా వేలాది కుటుంబాలు నిలబడేలా సహకరించింది.

– ఎస్.శ్రీనివాసకుమార్, ఈసీఈ ప్రొఫెసర్

ఆకట్టుకుంటున్న వస్త్ర ప్రదర్శన


ప్రదర్శనలో వస్త్రాలు కొనుగోలు చేస్తున్న మహిళలు

బోట్‌క్లబ్: స్థానిక నాగమల్లితోట జంక్షన్ వద్ద ఉన్న ద్వారంపూడి భాస్కర్‌రెడ్డి, పద్మావతి కల్యాణ మండపంలో ఏర్పాటు చేసిన వసుధ ఫ్యాషన్, లైఫ్‌స్టైల్ ఎగ్జిబిషన్ నగర మహిళలను ఎంతగానో ఆకట్టుకుంటోంది. ఈ సందర్భంగా నిర్వాహకులు ప్రవీణ్‌కుమార్, సీతాకాంత్ మాట్లాడుతూ గృహిణులు, మహిళలు, విద్యార్థినులకు ఉపయోగపడేలా దేశ నలుమూలల నుంచి ప్రఖ్యాతిగాంచిన సుమారు 50 పైగా డిజనర్లు రూపొందించిన వస్త్రాలను ప్రదర్శనలో ఉంచామన్నారు. ముంబయి, ఢిల్లీ, అహ్మదాబాద్, జైపూర్, కోల్‌కత్తా, మధ్యప్రదేశ్, చెన్నై, హైదరాబాద్ నగరాల నుంచి ప్రముఖ డిజైనర్లు వీటిని తీసుకొచ్చి నగర ప్రజలకు పరిచయడం చేసినట్లు తెలిపారు. ఈ ప్రదర్శన ఈ నెల 12వ తేదీ రాత్రి 9 గంటలు వరకూ ఉంటుందన్నారు. నగర ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ఓటర్ల సర్వేకు 74,573 దరఖాస్తులు

- పరిష్కారమైనవి 50,020
- కమిషనర్ నాగనరసింహారావు

కాకినాడ: కాకినాడ సిటీలో సమగ్ర ఓటర్ల సర్వేకు సంబంధించి ఫారం–6, 7, 8 ద్వారా 74,573 దరఖాస్తులు వచ్చాయని నగరపాలక సంస్థ ఈఆర్వో, కమిషనర్ సీహెచ్ నాగనరసింహారావు చెప్పారు. స్థానిక కార్పొరేషన్ కార్యాలయంలో మంగళవారం ఓటర్ల సర్వే ప్రక్రియ, జరుగుతున్న తీరు, ప్రగతిపై రాజకీయ పార్టీల ప్రతినిధుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ వచ్చిన దరఖాస్తుల్లో 50,020 ఈ–రోల్ నమోదులు, పరిష్కారాలు జరిగాయన్నారు. సుమారు 6,643 దరఖాస్తులు తిరస్కరించామని, ఇంకా 17,524 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయని వివరించారు. ఆచూకీ లేని ఓటర్లకు సంబంధించి 15,970 మందికి రిజిస్టర్ పోస్టుద్వారా నోటీసు పంపించామని వీటిలో 197 లేఖలకు ఓటర్లు అందుబాటులో ఉన్నట్టు సమాచారం ఇచ్చారన్నారు. 11,163 నోటీసులు వెనక్కి తిరిగి వచ్చాయన్నారు. సర్వే ప్రక్రియకు సంబంధించి పూర్తి పారదర్శకంగా ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలకు అనుగుణంగా జరుగుతోందని కమిషనర్ స్పష్టం చేశారు. ఆయా రాజకీయ పార్టీలు ఇచ్చిన సలహాలు, సూచనలను కూడా పరిగణనలోకి తీసుకుని పూర్తి పారదర్శకంగా దరఖాస్తులను పరిష్కరిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఎలక్షన్ డిప్యూటీ తహసీల్దార్ ఎంవీ మురళీకృష్ణ, వైఎస్సార్ సీపీ ప్రతినిధి రావూరి వెంకటేశ్వరరావు, బీఎస్పీ నాయకులు అప్పారావు, అమ్‌ఆద్మీ పార్టీ నాయకులు పాల్గొన్నారు.


రాజకీయ పార్టీల ప్రతినిధుల సమావేశంలో మాట్లాడుతున్న ఈఆర్వో నాగనరసింహారావు

వైఎస్సార్ సీపీ వెంటే మహిళలు

- ఎమ్మెల్యే కురసాల కన్నబాబు
- రమణయ్యపేటలో గడప గడపకూ..

కాకినాడ రూరల్: మహిళలు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే పయనించనున్నారని, గడప గడపకు కార్యక్రమంలో మద్దతుగా నిలుస్తున్నారని ఎమ్మెల్యే కురసాల కన్నబాబు తెలిపారు. రానున్న ఎన్నికల్లో మహిళల ఓట్లు జగనన్నకే అన్నారు. గడపగడపకు మన ప్రభుత్వంలో భాగంగా కాకినాడ అర్బన్ 1వ డివిజన్ రమణయ్యపేట సచివాలయం–1బి పరిధిలో మంగళవారం సాయంత్రం ఆయన పర్యటించారు. శెట్టిబలిజపేట, ఆర్టీసీకాలనీ, పద్మనగర్, వైద్యనగర్ తదితర ప్రాంతాల్లో ఇంటింటికీ తిరిగి ప్రభుత్వ సంక్షేమ పథకాలను లబ్ధిదారులకు, మహిళలకు వివరించారు. ప్రజా సమస్యలు అడిగి తెలుసుకుని వాటి పరిష్కారానికి అక్కడే సంబంధిత అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. ఈ సందర్భంగా కన్నబాబు విలేకరులతో మాట్లాడుతూ రమణయ్యపేట–1బి పరిధిలో రోడ్లు, డ్రైనేజీల సమస్యలు ఉన్నాయని, కొన్నిచోట్ల విద్యుత్ తీగలు మార్పులు చేయాలనే వినతులు వచ్చాయని, వాటిని పరిష్కరిస్తామన్నారు. ఇతర ప్రాంతాల నుంచి వచ్చి స్థిరపడిన వారిలో కొందరికి సాంకేతిక కారణాల వల్ల సంక్షేమ పథకాలు ఆగాయని తమ దృష్టికి తెచ్చారని, వారందరికీ పథకాలు అందేలా, పునరుద్ధరించేందుకు చర్యలు తీసుకున్నామన్నారు. ముఖ్యమంత్రి జగన్ మహిళాపక్షపాతిగా వారిపేరిటే సంక్షేమ పథకాలను అందిస్తున్నారన్నారు. తద్వారా మహిళలకు ఆర్థిక చేయూత అందించడంతో కుటుంబ అవసరాలకు వారు పథకాల సొమ్ములను చక్కగా వినియోగించుకుంటున్నారన్నారు. మరో ఐదారు నెలల్లో ఎన్నికలు వస్తున్నందున వైఎస్సార్ సీపీకి ప్రజలు అండగా నిలవాలని, జగనన్నకు మద్దతుగా నిలవాలన్నారు. ఈ కార్యక్రమంలో 1వ డివిజన్ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జ్ వాసిరెడ్డి సూరిబాబు, నాయకులు కొప్పిశెట్టి రమణ, భీమరాజు, వెంకటరమణ, చోడిశెట్టి నాగు, నాని, రెండో డివిజన్ ఇన్‌చార్జి పాటి సూరిబాబు, నాయకులు తుర్లంపూడి నాని, కొండలరావు, వైఎస్సార్ రాజు, సుబ్బారావు, తోటకూర శ్రీను, రవి, సచివాలయం సిబ్బంది, వలంటీర్లు, కార్పొరేషన్ అధికారులు పాల్గొన్నారు.


శెట్టిబలిజపేటలో సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే కురసాల కన్నబాబు

రేపు కేసీబీఎస్ వందేళ్ల సంబరాలు

సంస్థ అధ్యక్షుడు కోసూరి వెల్లడి

కాకినాడ: ది కాకినాడ కో–ఆపరేటివ్ బిల్డింగ్ సొసైటీ ఏర్పాటై వందేళ్లు పూర్తి చేసుకుని 101వ సంవత్సరంలోకి అడుగుపెడుతున్న సందర్భంగా గురువారం సాయంత్రం 5 గంటలకు స్థానిక సూర్యకళామందిరంలో వేడుకలు నిర్వహిస్తున్నట్టు కేసీబీఎస్ అధ్యక్షుడు కోసూరి శ్రీనివాస సత్యనారాయణమూర్తి చెప్పారు. కార్యక్రమ ఏర్పాట్లపై మంగళవారం సంస్థ డైరెక్టర్లు, ప్రతినిధులతో సమావేశమై చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా తమిళనాడు మాజీ చీఫ్ సెక్రటరీ, విశ్రాంత ఐఏఎస్ అధికారి పి.రామ్మోహనరావు, గౌరవ అతిథులుగా ఎంపీ వంగా గీత, ఎమ్మెల్యేలు ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి, కురసాల కన్నబాబు, డీసీసీబీ చైర్మన్ ఆకుల వీర్రాజు, కేంద్ర మాజీ మంత్రి పళ్లంరాజు, ఇన్‌కం టాక్స్ విశ్రాంత చీఫ్ కమిషనర్ పీవీ రావు, విశ్రాంత ఐఆర్ఎస్ అధికారి ఆర్.మంగబాబు తదితర ప్రముఖులు హాజరుకానున్నారు. సమావేశంలో సంస్థ ఉపాధ్యక్షుడు రెడ్డి వీరరాజేంద్రకుమార్, కార్యదర్శి ముమ్మిడి గోవిందు, డైరెక్టర్లు ముత్తా మధు, ముమ్మిడి వెంకటరమణ, ఒబిలిశెట్టి బుచ్చిరాజు శివ బాలయోగి, కోసూరి లక్ష్మీప్రసాద లావణ్య, ఇన్‌చార్జి మేనేజర్ చీమలకొండ గంగాధరం తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న కేసీబీఎస్ అధ్యక్షుడు కోసూరి శ్రీనివాస సత్యనారాయణమూర్తి

ఉత్సాహంగా ఎస్‌జీఎఫ్ఐ అథ్లెటిక్స్‌కు ఎంపికలు

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): జిల్లా పాఠశాల క్రీడాసమాఖ్య అండర్–14, 17 ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక జిల్లా క్రీడామైదానంలో అండర్–14, 17 అథ్లెటిక్స్‌లో బాల, బాలికల ఎంపికలు జరిగాయి. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా పరిధిలో వెయ్యి మంది ఈ ఎంపికల్లో పాల్గొన్నారు. వీరికి రన్స్, త్రోస్, జంప్‌ల్లో ప్రతిభా పరీక్షలు నిర్వహించి 48 మందిని అంతర్ జిల్లాల ఎస్‌జీఎఫ్ఐ చాంపియన్‌షిప్‌కు ఎంపికచేశారు. ఎంపికల నిర్వహణలో 80 మంది పీడీలు సహకరించారు. ఎస్‌జీఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ప్రసాద్ తెలిపారు. జిల్లా పీఈటీ సంఘ అధ్యక్షుడు వి.రవిరాజు, అథ్లెటిక్స్ సంఘ సభ్యులు గిరి, సూకరాజు, ప్రసాద్‌రెడ్డి, బాబి కౌరు తదితరులు పాల్గొన్నారు.


హర్డిల్స్‌లో పోటీపడుతున్న క్రీడాకారిణి


హైజంప్ విభాగంలో పోటీపడుతున్న క్రీడాకారిణి

తుస్సుమన్న టీడీపీ నిరసన దీక్షలు

స్పందన లేక డీలా పడిన తమ్ముళ్లు

కాకినాడ: మాజీ ముఖ్యమంత్రి, టీడీపీ అధినేత చంద్రబాబు అరెస్టు నేపథ్యంలో కాకినాడలో తెలుగుదేశం పార్టీ కేడర్ చేపట్టిన నిరసన దీక్షలు తమ్ముళ్లను ఉసూరుమనిపించాయి. బాలాజీచెరువు సెంటర్‌లో 28 రోజులపాటు నిర్వహించిన నిరసనలో మంగళవారంతో దీక్షను విరమించారు. చంద్రబాబు బెయిల్ విషయమై న్యాయస్థానం నుంచి స్పష్టత లేని నేపథ్యంలో ఇక చేసేది లేక, ప్రజా స్పందన కనిపించక వారు దీక్షలకు స్వస్తిపలికారు. మాజీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు నేతృత్వంలో సాగిన దీక్షా శిబిరాలు పేలవంగానే సాగాయి. నిరసనలకు టీడీపీ కేడర్ నుంచి ఆశించిన స్పందన కానరాలేదు. నిత్యం రద్దీగా ఉండే బాలాజీచెరువు సెంటర్‌లో నిరసనలు చేపట్టినా పట్టించుకునే నాథుడే కరువయ్యారు. ఏదో అనుకుంటే మరేదో అయిన రీతిలో దీక్షలకు స్పందన రాకపోవడంతో టీడీపీ కేడర్ ఉసూరుమంటూ పెదవి విరిచింది.

వనమాడిని వ్యతిరేకిస్తున్న టీడీపీలోని మరో వర్గం సిటీ పార్టీ చేపట్టే దీక్షలకు దూరంగా వ్యక్తిగతంగా కార్యక్రమాలు నిర్వహించడం ద్వారా చంద్రబాబుకు మద్దతుగా జరిగిన నిరసనల్లో గ్రూపు విభేదాలు కూడా బయటపడ్డాయి. చంద్రబాబు అరెస్టు అయ్యి జైలుకు వెళ్లిన కొద్దిరోజుల వ్యవధిలోనే బెయిల్ వచ్చేస్తోందన్న ఆశతో నిరసనలకు పిలుపునిచ్చిన కేడర్ ఆ దిశగా ఎలాంటి అవకాశాలు కనిపించకపోవడంతో ఉద్యమానికి గుడ్‌బై చెప్పేశాయి. ప్రజా స్పందన, కేడర్ నుంచి రెస్పాన్స్ లేని పరిస్థితుల్లో పేలవంగా ముగిసిన నిరసనలు ఆ పార్టీలో మరింత నిరాశ, నిస్పృహ, నిస్తేజానికి కారణమయ్యాయి.

మెకనైజ్డ్ మండీయార్డుకు నడకుదురు అనుకూలం

జిల్లా పౌరసరఫరాల సంస్థ మేనేజర్ పుష్పమణి

కరప: జిల్లాలో మెకనైజ్డ్ మండి యార్డ్ ఏర్పాటు చేయనున్నట్టు పౌర సరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ డి.పుష్పమణి తెలిపారు. ఇందుకు అనువైనన స్థలాన్ని ఎంపిక చేసేందుకు మంగళవారం ఆమె మండలంలో పర్యటించారు. కరప రైతు భరోసా కేంద్రం, పేపకాయలపాలెం, నడకుదురులలోని మార్కెట్ కమిటీ స్థలాలు, ఎస్‌డబ్ల్యూసీ గోదాంల స్థలాన్ని ఆమె పరిశీలించారు. ఎస్‌డబ్ల్యూసీ గోదాం స్థలం అనుకూలంగా ఉంటుందని పుష్పమణి తెలిపారు. ఈ సందర్భంగా ఆమె స్థానిక విలేకరులతో మాట్లాడారు. రైతుల నుంచి ఆర్‌బీకేల ద్వారా ప్రభుత్వ మద్దతు ధరకు కొనుగోలు చేసిన ధాన్యాన్ని ఈ యార్డుకు తరలిస్తారన్నారు. అక్కడే ఏర్పాటు చేసిన ల్యాబ్‌లో పరీక్షలు జరిపి, వేయింగ్‌బ్రిడ్జిపై కాటా తదుపరి చర్యలు చేపడతారన్నారు. ఈ యార్డు నెలకొల్పేందుకు 20 లారీలకు సరిపడా పార్కింగ్ ప్లేస్, వేయింగ్‌బ్రిడ్జి, ల్యాబ్, వర్క్‌షాప్, డ్రైయ్యర్‌వంటి వసతులు కల్పించేందుకు స్థలాన్ని పరిశీలించి, ఎస్‌డబ్ల్యూసీ గోదాంల పక్కస్థలం అనువుగా ఉందని డీఎం తెలిపారు. తహసీల్దార్ పి.శ్రీనివాసరావు, ఆర్ఐ పేపకాయల మాచరావు పాల్గొన్నారు.


నడకుదురులో స్థలాన్ని పరిశీలిస్తున్న జిల్లా మేనేజర్ పుష్పమణి, తహసీల్దార్ శ్రీనివాసరావు

సురక్ష శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

కరప: మండలం కూరాడలో మంగళవారం సర్పంచ్ వాసంశెట్టి వెంకటరమణ (కొండ) అధ్యక్షతన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం నిర్వహించారు. రంగా వర్సిటీ బోర్డు సభ్యుడు చింతా ఈశ్వరరావు ఈ కార్యక్రమంలో పాల్గొని ఈ వైద్య శిబిరాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కూరాడ, శివారు చినమామిడాడ నుంచి 590 మంది వచ్చి తమపేర్లను నమోదు చేయించుకున్నారు. వేళంగి పీహెచ్‌సీ డాక్టర్ ఎంకే సౌజన్య, డాక్టర్ ఇ.సింధూర తదితర వైద్య నిపుణులు రోగులను పరీక్షించి, మందులు రాసిచ్చారు. కంటిపరీక్షలు నిర్వహించి, కళ్లజోళ్లను అందజేశారు. ఐసీడీఎస్ కాకినాడ రూరల్ ప్రాజెక్టు సీడీపీఓ వి.లక్ష్మి ఆధ్వర్యంలో అంగన్‌వాడీలు పౌష్టికాహారం స్టాల్స్‌ను ఏర్పాటుచేసి అవగాహన కల్పించారు. ఈసందర్భంగా అధికారులు, నాయకులు కేస్‌షీట్, మందులతో కూడిన జగనన్న ఆరోగ్య సురక్ష కిట్లను రోగులకు అందజేశారు. పీఏసీఎస్ చైర్మన్ రావుల ప్రసాద్, ఉప సర్పంచ్ రావుల శ్రీను, వైఎస్సార్ సీపీ నాయకులు పెంకే సత్తిబాబు, గుత్తుల బాలాజీ, ఎంపీడీఓ కె.అప్పారావు, గ్రామకార్యదర్శి ఎం.చక్రపాణి, ఆరోగ్యమిత్ర వంచెర్ల వీరభద్రరావు పాల్గొన్నారు.


కూరాడలో రోగులకు మందుల కిట్లు అందజేస్తున్న అధికారులు, నాయకులు

మానసిక ఆరోగ్యం మానవాళి హక్కు

- జీజీహెచ్ మానసిక వ్యాధుల వైద్య నిపుణుడు వానపల్లి
- చైతన్యవంతంగా ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవం

కాకినాడ క్రైం: మానసిక ఆరోగ్యం ప్రపంచ మానవాళి హక్కు అని కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రి మానసిక వ్యాధుల నిపుణుడు డాక్టర్ వానపల్లి వరప్రసాద్ తెలిపారు. మంగళవారం ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవం సందర్భంగా రోటరీ క్లబ్ సెంట్రల్, ప్రజ్ఞ మైండ్ చైల్డ్ అండ్ మైండ్ క్లినిక్ సంయుక్త ఆధ్వర్యంలో కాకినాడలోని ఎస్ఎంఎస్ రోటరీ సర్వీస్ సెంటర్ ఆధ్వర్యంలో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో వరప్రసాద్ ముఖ్య వక్తగా పాల్గొన్నారు. «మెంటల్ హెల్త్ ఈస్ యూనివర్సల్ హ్యూమన్ రైట్» అనే అంశంపై ప్రసంగించారు. మానసిక ఆరోగ్య ప్రాధాన్యంపై అవగాహన కల్పించారు. శారీరక ఆరోగ్యాన్ని సైతం మానసిక పరిస్థితే నిర్దేశిస్తుందని అన్నారు. అవగాహన లేని ఎందరో మానసిక ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేస్తున్నారని తెలిపారు. గడచిన దశాబ్దకాలంగా మానసిక సమస్యలు అధికంగా నమోదవుతున్నాయని అన్నారు. రోటరీ కాకినాడ సెంట్రల్ అధ్యక్షుడు ఎం.విద్యాసాగర్, కార్యదర్శి ఎం.వెంకట్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది.


జీజీహెచ్‌లోని మానసిక వైద్య విభాగం వద్ద రోగులు, బంధువులకు అవగాహన కల్పిస్తున్న సైకియాట్రీ బృందం

జీజీహెచ్‌లో..

ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవం సందర్భంగా మానసిక వ్యాధులు, పరిష్కార మార్గాలపై జీజీహెచ్‌కు వచ్చిన రోగులు, వారి బంధువులకు అవగాహన కల్పించారు. మానసిక వైద్య విభాగం ఆధ్వర్యంలో ప్రొఫెసర్ డాక్టర్ రామచంద్రరావు, అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ వానపల్లి వరప్రసాద్, మద్యపాన విమోచన కేంద్ర మానసిక వైద్య నిపుణుడు డాక్టర్ వానపల్లి కాటన్ పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ మానసిక వ్యాధుల సమస్యకు మత్తు, మద్యం, ధూమపానం, మానసిక అనారోగ్యాల పట్ల నిర్లక్ష్యం ప్రధాన కారణమని తెలిపారు.


సదస్సులో ప్రసంగిస్తున్న మెజిస్ట్రేట్ షేక్ షరీన్

దివ్యాంగులతో ప్రేమగా మెలగాలి

కాకినాడ రూరల్: వాకలపూడిలోని ఉమా మనో వికాస కేంద్రంలో ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవం మంగళవారం నిర్వహించారు. మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. కేంద్రం ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎస్.పెద్దిరెడ్డి అధ్యక్షన జరిగిన సదస్సులో ముఖ్య అతిథిగా పాల్గొన్న కాకినాడ 5వ అదనపు జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ షేక్ షరీన్ మానసిక రుగ్మతలు గల వ్యక్తులకు చట్టం ప్రకారం లభించే హక్కులను వివరించారు. దివ్యాంగుల పట్ల ప్రతి ఒక్కరూ ఆదరణ చూపాలన్నారు. ముఖ్యంగా మానసిక స్థితి సరిగా లేనివారి పట్ల ప్రేమ చూపాలన్నారు. ఈ కేంద్రం ద్వారా దివ్యాంగులకు అందుతున్న సేవలు అభినందనీయమన్నారు. న్యాయవాదులు, ఉమా మనోవికాస కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

సామాజిక అంశాలపై చైతన్యం అవసరం


సామర్లకోటలో హరిప్రియుడును అభినందిస్తున్న ఆర్జేడీ నాగమణి

- విద్యార్థులకు ఆర్జేడీ నాగమణి పిలుపు
- ప్రధాని మోదీ అభినందన పొందిన హరిప్రియుడుకు ప్రశంసాపత్రం అందజేత
- సీబీఎస్‌ఈ పరీక్ష పత్రాల పరిశీలన

సామర్లకోట: మున్సిపల్ హైస్కూల్ విద్యార్థికి ప్రధాని మోదీ నుంచి అభినందన రావడం గర్వించదగ్గ విషయమని విద్యాశాఖ ఆర్‌జేడీ జి.నాగమణి అన్నారు. మంగళవారం సాయంత్రం స్థానిక బచ్చు ఫౌండేషన్ మున్సిపల్ హైస్కూల్‌ను ఆమె సందర్శించి పరీక్ష పే చర్చలో పాల్గొన్ని ప్రధాని మోదీ నుంచి అభినందన పొందిన 10వ తరగతి విద్యార్థి హరిప్రియుడుకు ప్రశంసాపత్రాన్ని అందజేసి అభినందించారు. విద్యార్థులు చదువుతో పాటు సామాజిక చైతన్యం కలిగించే అంశాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. సీబీఎస్‌ఈ విధానంలో జరిగిన పరీక్ష పత్రాలను ఆమె పరిశీలించారు. విద్యతో పాటు అన్ని కార్యక్రమాల్లో విద్యార్థులను ప్రోత్సహిస్తున్న హెచ్ఎం తోటకూర సాయిరామకృష్ణను ఆర్‌జేడీ అభినందించారు. ఈ ఏడాది ఈ హైస్కూల్‌కు 9వ తరగతి నుంచి సీబీఎస్‌ఈ విధానం అమలులోకి వచ్చిన నేపథ్యంలో విద్యార్థులను ఆ మేరకు ఉపాధ్యాయులు తయారు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డీవైఈఓ ఆర్‌జే డానియల్‌రాజు, ఎంఈఓలు వై.శివ రామకృష్ణయ్య, పి.పుల్లయ్య, హెచ్ఎంలు యు.సత్యనారాయణ, మీనామాధురి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.